**ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం**

**ప్రాంతీయ వార్తా విభాగం**

**ప్రాంతీయ వార్తలు**

**తేది:12.04.2026** **సమయం:13.10 గంటలు**

**ముఖ్యాంశాలు**

1. తెలంగాణ ఇంటర్మీడియట్ ఫలితాలను రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు కే.కేశవరావు విడుదల చేశారు. మొదటి సంవత్సరంలో 66.20 శాతం, రెండవ సంవత్సరంలో 70.58 శాతం ఉత్తీర్ణత నమోదయ్యింది.
2. హుస్నాబాద్ నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతామని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.
3. హైదరాబాద్ లో హైటెక్ సిటీ ప్రాంతంలో మరో సాంస్కృతిక కేంద్రాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్మిస్తోందనీ, డిసెంబర్లోగా అందుబాటులోకి వస్తుందని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి చెప్పారు.
4. దివ్యాంగుల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య కోరారు.

..........................................................................................

**Inter results:**

ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల ఫలితాలను ఈరోజు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కే.కేశవరావు విడుదల చేశారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో 66.20 శాతం ఉత్తీర్ణత నమోదయింది. సెకండ్ ఇయర్లో 70.58 శాతం ఉత్తీర్ణత నమోదయింది. మొదటి సంవత్సరం ఫలితాల్లో మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా మొదటి స్థానంలో నిలువగా.. సెకండ్ ఇయర్ ఫలితాల్లో జయశంకర్

భూపాలపల్లి జిల్లా ప్రథమ స్థానంలో నిలిచాయి. ఫలితాలను విడుదల చేసిన అనంతరం కేశవరావు మాట్లాడుతూ.. ఈ పరీక్షలో ఫెయిల్ అయినవారు కృంగిపోవద్దని సూచించారు. గడిచిన సంవత్సరం కంటే నాలుగు శాతానికి పైగా ఉత్తీర్ణత శాతం పెరగడం పట్ల ఇంటర్మీడియట్ బోర్డును అభినందించారు.

ఈ ఏడాది 1495 కేంద్రాలలో పరీక్షలు నిర్వహించారు. 9 లక్షల 97 వేల మంది పరీక్షలు రాసారు. 30వేల మంది పరీక్షల నిర్వహణలో పాల్గొన్నారు. 20 జిల్లాలో స్పాట్ వాల్యుయేషన్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ డైరెక్టర్ జనరల్ రవి గుప్తా, విద్యాశాఖ కార్యదర్శి యోగితా రానా, విద్యాశాఖ డైరెక్టర్ శ్రీ దేవసేన తదితరులు పాల్గొన్నారు. వచ్చేనెల 13వ తేదీ నుంచి సప్లిమెంటరీ పరీక్షలు జరుగుతాయని అధికారులు తెలియజేశారు.

**......GS/RNU/HYD.**

**పొన్నం ప్రభాకర్**

హుస్నాబాద్ నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతామని రవాణా, శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఈరోజు హుస్నాబాద్ మండలం కూచనపల్లి లో 21 కోట్ల 30 లక్షలతో నిర్మిస్తున్న చెక్ డ్యాం ఫీడర్ చానెల్ కి మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. హుస్నాబాద్ లో అర్బన్ ఫారెస్ట్ పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. ఉపాధి అవకాశాలు మెరుగుపర్చడానికి ఇండస్ట్రియల్ కారిడార్ తీసుకువస్తున్నామని తెలిపారు.

**......పీటీసీ – సిద్దిపేట**

**మరో రవీంద్రభారతి**

హైదరాబాద్ లో ఉన్న రవీంద్రభారతి తరహాలో హైటెక్ సిటీ ప్రాంతంలో మరో సాంస్కృతిక కేంద్రాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్మిస్తోంది. సుమారు 23 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టిన ఈ కేంద్రం నిర్మాణ పనులను కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి నిన్న సాయంత్రం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఐటీ కారిడార్ విస్తరిస్తున్న

నేపథ్యంలో ఈ ప్రాంత కళాకారులు, ప్రజలకు అందుబాటులో ఉండేలా మాదాపూర్‌లోని సెంటర్ ఫర్ కల్చరల్ రిసోర్స్ అండ్ ట్రైనింగ్ సెంటర్ ప్రాంగణంలో కేంద్ర ప్రభుత్వం ఈ అత్యాధునిక కల్చరల్ సెంటర్‌ను నిర్మిస్తోందని చెప్పారు. తాను కేంద్ర సాంస్కృతిక శాఖ మంత్రిగా ఉన్న సమయంలో దీనిని మంజూరు చేయించామని అన్నారు. డిసెంబర్ నాటికి పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

.....డెస్క్

**దామోదర**

ఫోరెన్సిక్ మెడిసిన్ విభాగాన్ని మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వ వైద్య కళాశాలల్లో 37 పీజీ సీట్లు ఉన్నాయని, భవిష్యత్తులో మరిన్ని సీట్లను అందుబాటులోకి తీసుకొస్తామని తెలియజేశారు. గాంధీ వైద్య కళాశాలలో నిన్న జరిగిన ఫోరెన్సిక్ మెడిసిన్ వార్షిక సదస్సులో మంత్రి మాట్లాడుతూ.. ప్రభుత్వ ఫోరెన్సిక్ వైద్యులు అంకితభావంతో పనిచేస్తున్నారని అభినందించారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లోని మార్చురీల్లో అవసరమైన సదుపాయాలు కల్పిస్తున్నామని చెప్పారు.

.....డెస్క్

**పికో టెక్నాలజీ**

అమెరికాకు చెందిన పికో టెక్నాలజీ సంస్థ హైదరాబాద్‌లో జీసీసీ ఏర్పాటు చేయబోతోందని పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. నిన్న సచివాలయంలో ఆ సంస్థ ప్రతినిధులు ఆయనతోపాటు రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. ప్రపంచ స్థాయి ఆర్థిక సంస్థలు తమ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్‌ల ఏర్పాటుకు హైదరాబాద్‌ను గమ్యస్థానంగా ఎంపిక చేసుకుంటున్నాయన్నారు. నైపుణ్య మానవ వనరులు, అంతర్జాతీయ మౌలిక సదుపాయాలు, రవాణా, చౌక ధరల్లో అద్దెలు అందుబాటులో ఉండటమే దీనికి కారణమని ఆయన తెలిపారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రపంచంలోని పెద్ద నగరాలకు మించి హైదరాబాద్‌లో రవాణా

సదుపాయాలు అభివృద్ధి చేస్తున్నామన్నారు. హయత్‌నగర్, ఎల్‌బీనగర్ మధ్య డబుల్ డెక్కర్ రోడ్లు నిర్మిస్తామని చెప్పారు.

.....డెస్క్

**పోచారం**

సిరి సంపదలు ఎన్ని ఉన్నా, సరైన ఆరోగ్యం లేకపోతే అన్నీ వ్యర్థమేనని ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక'లో భాగంగా నిర్వహించిన ఆరోగ్య వారోత్సవాల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రూరల్ ఏరియాలో అత్యధికంగా సాధారణ ప్రసవాలు చేసిన ఆస్పత్రిగా బాన్సువాడ ఆస్పత్రి రాష్ట్రస్థాయి అవార్డు పొందిన నేపథ్యంలో ఆసుపత్రి వైద్యులు, వైద్య సిబ్బందిని పోచారం అభినందించారు.

.....కామారెడ్డి

**సైన్స్ ఎక్స్ పీరియన్స్ సిటీ**

హైదరాబాద్‌లో నిర్మిస్తోన్న 'సైన్స్ ఎక్స్ పీరియన్స్ సిటీ' వివరాలను కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఈ కేంద్రం భవనం ఆకృతులను మొదటిసారిగా వెల్లడించారు. ఎన్‌జీఆర్ఐ పక్కనే ఐఐసీటీ ప్రాంగణంలో 232 కోట్ల 70 లక్షల రూపాయల అంచనా వ్యయంతో ఈ నిర్మాణాలు చేపడుతున్నారు. నేషనల్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ మ్యూజియమ్స్ ఈ ప్రాజెక్టు చేపడుతోంది. శాస్త్రవిజ్ఞానం పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా, ప్రయోగాత్మక విద్యను ప్రోత్సహించాలనే లక్ష్యంతోనే ఈ కేంద్రాన్ని నిర్మిస్తున్నారు. ఇందులో త్రీడీ డిజిటల్ డోమ్ థియేటర్, వాక్ త్రూ అక్వేరియం, మోషన్ సిమ్యులేటర్లు, రోబోటిక్స్ సెంటర్, అంతరిక్ష ప్రదర్శనశాల, ఇన్నోవేషన్ హబ్స్ ఉంటాయి.

.........డెస్క్

**పొన్నం ప్రభాకర్**

వ్యవసాయ శాఖ తరఫున చాలా సంవత్సరాల తరువాత ప్రజా ప్రభుత్వంలో వ్యవసాయ పనిముట్లు పంపిణీ చేస్తున్నామని రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. కరీంనగర్ జిల్లా చిగురు మామిడిలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ స్థలాన్ని పరిశీలించిన అనంతరం పలువురు రైతులకు వ్యవసాయ పనిముట్లు అందజేశారు. ఈ సందర్భంగా పొన్నం ప్రబాకర్ మాట్లాడుతూ...

**బైట్ – పొన్నం ప్రభాకర్**

**.......పీటీసీ - కరీంనగర్**

**దివ్యాంగులు**

దివ్యాంగుల జీవనోపాధికి అవకాశాలు మెరుగుపరచడం కోసం ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య అన్నారు.. నల్గొండలో జరిగిన కార్యక్రమంలో ఆయన దివ్యాంగులకు ఉచిత సహాయ ఉపకరణాలను పంపిణీ చేసారు. ఈ సందర్భంగా వీరయ్య మాట్లాడుతూ.... వికలాంగులను సకలాంగులు వివాహం చేసుకుంటే ఇచ్చే నజరానను, ప్రభుత్వం 2 లక్షల రూపాయలకు పెంచిందని, ఉద్యోగ అవకాశాల్లో నాలుగు శాతం, ఉన్నత విద్యలో ఐదు శాతం రిజర్వేషన్లు ఇందిరమ్మ ఇళ్లలో ఐదు శాతం రిజర్వేషన్లను కల్పిస్తూ ప్రభుత్వం జీవోలను జారీచేసిందని అన్నారు.

**......పీటీసీ – నల్గొండ**

**విబీ జీ రామ్ జీ**

కేంద్ర ప్రభుత్వం కూలీల కోసం ప్రవేశపెట్టిన విబీ జీ రామ్ జీ లో గతంలో 100 రోజుల పని దినాలను 125 రోజులకు పెంచడం లాభ దాయకమని, రాజన్న సిరిసిల్ల జిల్లా ఆశిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కట్కూరి ఆనందం చెప్పారు. ఆకాశవాణితో ఆయన మాట్లాడుతూ.....

**.....బైట్ - కట్కూరి ఆనందం.....**

**......పీటీసీ – రాజన్న సిరిసిల్ల**

**మాదకద్రవ్యాల నియంత్రణ**

మాదకద్రవ్యాల నియంత్రణ కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈగల్ ఫోర్స్ టీం అత్యంత సమర్థవంతంగా పనిచేస్తుందని సీఐ గోపి అన్నారు. నారాయణపేట జిల్లాలోని మెడికల్ షాప్ ఓనర్లకు అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ..

**......Byte: ఈగల్ ఫోర్స్ టీం సర్కిల్ ఇన్ స్పెక్టర్ గోపి...**

**....పీటీసీ – మహబూబ్ నగర్**